# డెడ్ లెటర్

ప్రేమించడం నేరం కాదు. సహజం. జీవితం అదివరకే ఒకరికి అంకితమై, వారి నమ్మకం మారగొని ఉన్నట్లయితే ఏది ఏమైనా ఒకరి సుఖం మరొకరి దుఃఖం మాత్రం అవుతుంది.



తుర్లపాటి రామచంద్రరావు

"**చూశారా,** సార్, విచిత్రం, ఇద్దరూ ఒకేసారి ఉత్తరాలు వ్రాసుకొని ఇద్దరూ ఒకేసారి మాయమయ్యారల్లే ఉంది. పాపం! ఆ రెండు ఉత్తరాలూ తమను స్వీకరించేవారు లేక ఈ డెడ్ లెటర్ ఆఫీసుకు చేరాయి" అంటూ పోస్ట్‌మన్ సుబ్బయ్య ఉత్తరాలను అందించాడు. అందుకొని చిరునామాలు చూశాను, ముందు వెనుకలకు త్రిప్పి. ఒకళ్ల కొకళ్ళు వ్రాసుకొన్న ఉత్తరాలు అవి.

"ఇప్పుడే వస్తాను, సుబ్బయ్యా" అని చెప్పి సైకిలుపై బయలుదేరాను చిరునామాల ప్రకారం.

"రాత్రే ఎక్కడికో వెళ్లారు బాబూ. ఎక్కడికెళ్లారో, ఎప్పుడొస్తారో కూడా చెప్పలేదు."

ఆ రెండు ఇండ్లనుండి వచ్చిన సమాధానం అది. నిరాశతో ఆఫీసుకు తిరిగి చేరాను. కుతూహలాన్ని చంపుకోలేక ఉత్తరాలను చదవటం ప్రారంభించాను.

"రమణగారూ,

ఎట్టకేలకు ఉత్తరాన్ని వ్రాయటానికి సాహసించాను. ఇంతవరకు మీ ఎదుటకు రాలేని నాలో నిబిడీకృతమై ఉన్న ఉద్వేగం, బాధ,



దిగులు

చిత్రం—బి. వి. రమణమూర్తి (అనకాపల్లి

కోర్కెలన్నిటిని స్వయంగా చెప్పే గుండెనిబ్బరం లేక ఈ లేఖ ద్వారా తెల్పుతున్నాను. దీనిలోని విషయాలన్నీ మీ హృదయంలోనే పదిలపరుచుకోండి. నాపీద ఒట్టుగా మరే హృదయానికి వీటిని తెలియనివ్వకండి. భౌతికంగా కనిపించే ఈ లేఖకు నామరూపాలు లేకుండా చేయండి.

ఈ రాత్రి నాకు అదృష్టకరమైనదో, కాదో నేను చెప్పలేను. కాని, నేనీ రాత్రి పడుతున్న ఆవేదన మరెప్పుడూ పడకూడదని, ఈ సమయంలో వచ్చిన నిర్ణయాన్ని ఎట్టి సమయంలోనూ ఉల్లంఘించకూడదని అనుకొంటున్నాను. నాకా అవకాశాన్ని మీరే ప్రసాదించాలి. అట్టి కోర్కె కోరేముందు నాలో పాతుకుపోయిన భావ బాధాపరంపరలను మీ ముందుంచితే కాని కొంత తగ్గవనే ఉద్దేశంతో వాటిని ఈనాడు మీ ముందుంచి ఆ పిదప నేను మీకు దూరమవుతాను.

నేను మిమ్మల్ని ప్రేమించాను. ప్రేమఅంటే నే నిచ్చే నిర్వచనం సదా మీరు నా చెంతనే ఉండాలనే బలీయమైన కోర్కె నాలో ఉండటం. ఆ కోర్కె కలగటానికి కూడా కారణం నా భర్తకు నేను మూడవ భార్య కావటమూ కాదు; వారివల్ల నాకే సుఖమూ లేదనీ కాదు. అన్ని హృదయాల సంగతి నాకు తెలియదు కాని, నా హృదయంలో రెండు పీఠాలు ఉన్నాయి. బాధ్యతాయుతమైన పీఠంపై మా వారు అధిష్ఠించారు. నేనే నా మనఃపూర్వకంగా వారిని ఆ స్థానంపై అధిష్ఠింపజేశాను. వారిని ఏనాడూ శాశ్వతమైన ఆ స్థానంనుండి బలవంతంగానైనాసరే తొలగించి మరో వ్యక్తికి ఆ స్థానాన్ని ఇవ్వాలని నేను అనుకోవటంలేదు, అనుకోను కూడ. ఇక రెండవది ఆత్మీయతా పీఠం. ఇది నా హక్కు అని ఎవరూ ఆ స్థానముతో బైఠాయించలేరు. తమ కిష్టమైన వ్యక్తికి బహిరంగంగా కాక తన ఆత్మ సాక్షిగా ఆ ఆత్మీయతా పీఠాన్ని సమర్పిస్తుంది. మీకు నేను ఆ స్థానాన్ని ఇచ్చాను. అంటే ఎప్పుడూ మీరు ఎదుటనే ఉండాలని, మీ సర్వ బాధ్యతలు నేనే నెరవేర్చాలనే కోర్కె నాలో కలిగిందన్న మాట. ఆ కోర్కె నాలో కలగటానికి కారణం నే నేమీ చెప్పలేను. ఒక్కొక్క వ్యక్తిని చూస్తుంటే విపరీతమైన అసహ్యం ఎందుకు కలుగుతుందో, ఒక్కొక్క వ్యక్తిపట్ల ఆత్మీయత ఎలా పుట్టుకువస్తుందో, అతనిపట్ల ఒక విధమైన కోర్కె, అనురాగం, అతన్ని గురించే ఆలోచించటం మొదలైనవి ఎలా ఉద్భవిస్తాయో నేను చెప్పలేను. కాని అవి మీపట్ల ఉద్భవించాయని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. అలాంటి భావాలన్నీ మీపై నాకు కలిగాయి కనుకనే మీ కా స్థానాన్ని ఇవ్వగలిగాను. కాని ఆ స్థానాన్ని మీకు ఇచ్చినపిదప నే నేదైనా తప్పు చేశానా అనిపించింది. అది ఎట్టి అఘాయిత్యానికైనా దారి తీస్తుందేమోననే భయం కల్గింది. అందుకే దానికి ఉన్న ఆ స్వేచ్ఛను అరికట్టి బంధించటానికే ఈ ఉత్తరం మీకు వ్రాస్తున్నాను.

మీకు భవిష్యత్తులో అభివృద్ధిలోనికి రావలసినవారు. ఆర్థికంగానూ, సాంఘికంగానూ, మానసికంగానూ ఎంతో ఉన్నతస్థితికి రావలసినవారు. వీణపై సున్నితంగా నాట్యం చేసే మీ వేళ్ళు నావి కావాలని, నన్ను పెనవేసుకోవాలని నేను కోరుకోదలుచుకోలేదు. కేవలం మీ వీణా నాదానికి నా నృత్యం జోడించాలనే ప్రబలమైన కోర్కె నాలో ఉన్నప్పటికీ అది ఈ పరిస్థితులలో, ఈ వైవాహిక జీవనంలో, ఈ సంకుచిత వాతావరణంలో ఎంతవరకు అభినందనీయమో నాకు తెలియటం లేదు. మీరు నన్ను ప్రేమిస్తున్నారని నేను గ్రహించాను. కాని, ఆ ప్రేమను బహిర్గతం చేయకుండా ఉన్నందుకే మీరంటే నాకా ఉన్నత ఉత్తమ అభిప్రాయం ఏర్పడింది. నిజంగా మీ గానానికి, వీణా నాదానికి నా అందెలు శ్రుతి కల్పితే ఆ ఆనందంలో మనం స్వర్గధామంలో పయనించటం ఖాయమే. కాని ఆ అవకాశం మనకీ జీవితంలో లేదు, రాదు, రానీయనుకూడ. ఎందుకంటే నేను నేను కాదు. ఏనాడో ఆక్రమింపబడినదాన్ని. మీ కంటికి, దృష్టికి చిన్నగా కన్పించినా నేను మీకంటే పెద్దదాన్ని. పదహారు సంవత్సరాల వైవాహిక జీవితం గలదాన్ని. చేతినిండా పని, నా శరీరంలోని రక్తాన్ని పంచుకొన్న శిశువు నా కింతవరకు లేకపోబట్టి మీకు చిన్నదానిగా కన్పించవచ్చు. బీదరికంవల్లకానీ, లేదా ఏదో అపతనీయమైన గీతవల్లకానీ నేను వయసు మళ్ళినవారికి భార్యనయ్యాను. మొదటి ఇద్దరి భార్యలతో ఎనిమిది సంవత్సరాలు సుఖసౌఖ్యాలూ అనుభవించినవారికి నేను భార్యనైనందుకు నేనేమీ బాధపడటం లేదు, విచారించటం లేదు. వారు నన్ను ప్రేమిస్తున్నారు. పువ్వుల్లో పెట్టి కాపాడుకొంటున్నారు. నా సర్వ సౌఖ్యాలూ చూస్తున్నారు. వారివల్ల నేనన్నీ సుఖాలు పొందుతున్నాను. వారిని పొందినందువల్ల నేను ఏ నిరాశకు, అసంతృప్తికి, బాధకు లోను కాలేదు, కావటంలేదు. నాపై వారికెంతో నమ్మకం ఉంది. అందుకే వారు నన్ను నృత్య విద్య నేర్చుకొనటానికి, మీవంటి వ్యక్తులతో స్వేచ్ఛగా ఉండటానికి అనుమతించారు. వారికి ఏవిధమైన ద్రోహమూ చేయననే పరిపూర్ణమైన దృఢవిశ్వాసం నాపట్ల వారికి ఉంది. వారిపట్ల ఆజన్మాంతం కృతజ్ఞతతో ప్రేమ భావం చూపించి సేవించటం నా ధర్మమై ఉంది. అటువంటి పరిస్థితులలో నా హృదయంలోని అగోచరమైన స్థానంలో మీరున్నారని, నేనే స్వయంగా మీ కా స్థానాన్ని ఇచ్చానని వారు గుర్తిస్తే, ఎంతటి మానసిక బాధకు గురి అవుతారో తలుచుకొంటే నాకే భయంగా ఉంది. ఏ భర్త తన భార్య మరొక వ్యక్తికి తన హృదయంలో స్థానం ఇచ్చిందని తెలుసుకొంటే పూర్వ ప్రేమను ప్రకటించలేడు; పైగా ద్వేషిస్తాడేమో కూడా. అందుచేత దైవ సమానులైన నా భర్తకు అటువంటి పరిస్థితిని నేనెందుకు కల్పించాలనిపించింది. అందుకే మేల్కొని మీకీ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను.

ఎప్పుడూ ఏ వ్యక్తీ తనకు కావలసిన వ్యక్తి దక్కకపోతే తాను బ్రతుకలేనని, తనకా వస్తువు లభించకపోతే తాను జీవించలేనని అనుకోరాదు. తృప్తే మానవునికి హాయి నిస్తుంది. మానసికానందమే మానవుడికి స్వర్గలోకం చూపిస్తుంది. నేను మీకు దూరమవుతున్నందున మీరు మీ కళాదేవతను దూరం చేసుకోకండి. మీరు ఆ విద్యలో రాణించాలని, పేరు ప్రఖ్యాతులు గడించాలని నా కోర్కె. నా గురించి ఆ అవకాశాన్ని తాము విడనాడకండి. నన్ను మరిచిపోవటం దుస్సాధ్యమైన విషయం ఏమీకాదు. నన్ను మరిచి మీరు మీ కళామతల్లిని ఆరాధించటానికి ప్రయత్నించండి. నేనూ, మావారూ ఇల్లు ఖాళీచేసి రేపే ఈ ప్రాంతంనుండి వెళ్ళిపోతున్నాము. నాకు కొంత మనశ్శాంతి లభించటానికి కొంతకాలం తీర్థయాత్రలు చేయాలనీ, ఆ పిదప ఏ ఏకాంత ప్రదేశంలోనో నిర్మలంగా గడపాలనీ నా నిర్ణయం. కాని వెళ్ళేముందు నాకు ఉన్న కోర్కె ఒక్కటే మీకు తెల్పుతున్నాను. మీది ప్రేమ హృదయం. ఏమాత్రం బాధను, లోపాన్ని సహించలేరు మీరు. మిమ్మల్ని అర్థం చేసుకొని పువ్వుల్లో పెట్టి పూజించుకొనే భార్య రావాలి మీకు. అలాంటి వ్యక్తి మీకు దక్కాలని నా కోర్కె. అలాంటి వ్యక్తి మీకు దక్కనినాడు మీ జీవితం దుఃఖపూరితం అవుతుంది. అలా కాకూడదనే నా ఆకాంక్ష. మీరేనాడూ బాధ పడకూడదని. మిమ్మల్ని దేవుడులా చూసుకొని పూజించి సేవించే వ్యక్తివచ్చి మీ జీవితం సుఖమయం చేయాలన్నదే నా కోర్కె.

ఇలా నా హృదయాన్ని విప్పి మీముందుంచినందుకు నన్ను క్షమించండి.

సెలవు.

సుమతి."

ఉత్తరం మడిచి, రెండో ఉత్తరం తెరిచాను.

"సుమా,

ఈరాత్రి కుంభవృష్టి కురుస్తున్నది. దొడ్లోని బాదంచెట్టు పెళపెళా విరిగిపోయింది. నా గది ప్రక్కన నీవు వేసిన సన్నజాజి పందిరి కుప్పగా కూలిపోయింది. తెల్లగా విచ్చిన పూలన్నీ కన్నీళ్లు కారుస్తూ పందిరిక్రింద పడి మరణించాయి. నీవు ప్రతిదినమూ వచ్చి ప్రేమగా పోషించే ఆ చెట్టు కూలగానే నా హృదయం బద్దలయింది. ఎంతోకాలంనుండి బయటకు రాలేక నన్ను నిలువునా దహిస్తున్న అగ్నిపర్వతం బైటపడింది. ఇక నే నీ పరిస్థితులలో కాలం గడపలేననిపించింది. ప్రతి క్షణమూ నన్ను కౌగలించుకు తిరిగే నా పిరికితనాన్ని ధైర్యం ఓడించింది; నీకీ ఉత్తరం వ్రాయిస్తున్నది. భయంకరమైన ఈ కాళరాత్రి నాకొక విజ్ఞానాన్ని ప్రసాదించింది. నా కళ్లను తెరిపించింది. ఆ కొత్త వెలుగులో కూర్చుని నీకీ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను.

నీకు ఈ ఉత్తరం వ్రాయటానికి పూనుకోగానే ఒక్కసారి నా జీవితం నా కళ్లముందు మెదిలింది. అది నీకు తెలిపి దానికి కలిగిన విషమ విషాద వికృత పరిస్థితులను నీకు వెల్లడి చేయాలనిపించింది. నా కా రోజు బాగా గుర్తు ఉంది. ప్రథమంగా నీవు తోడికీర్తన పాడమని నన్ను కోరిన ఆ ఘడియ నా స్మృతిపథంలో ప్రతిక్షణమూ మెదులుతూ ఉంటుంది. ఒక్కసారి జీవితంలో గాఢమైన దెబ్బతిన్న నేను తదనంతరం స్త్రీలకు దూరంగా ఉండటానికి అలవాటు పడటానికి ప్రయత్నిస్తున్నాను. అట్టి సమయంలోనే నీవు నాకు సాక్షాత్కరించావు. అయినా నేను నిన్నూ గుర్తించనూ లేదు; స్మరించటానికి ప్రయత్నించనూలేదు. కాని, ఒకనాడు ధైర్యంతో నీవు నిష్కల్మషంగా కోరినకోర్కెను కాదనలేకపోయాను. తోడి రాగం ఆలాపించి 'ఎందుకు దయా రాదు రా' కీర్తన స్వరసాహిత్యాలు పాడాను. నా పాట విని నీవు నాకు పొగడ్తలు అందజేశావు. వాటిని కూడ నేను హృదయానికి హత్తుకొని ఆనందించలేదు. ఆ పిదప గురువుగారి ఆజ్ఞపై 'ఆనందభైరవి'లో జావళి ప్రారంభించాను. తన్మయత్వంలో పడి నీవు నృత్యం ప్రారంభించావు. నీ నృత్యానికి, నా గానానికి మధ్య వీణానాదం ఉంటే బాగుంటుం దనిపించింది. వెంటనే వీణను మీటటం ప్రారంభించాను. నీవు మైమరచి నాట్యం చేశావు. ఆరోజు నేను మరువలేను. కాని ఆనాడు నీనృత్యం చూసిన పిదప కూడ వెంటనే నేను కలలు కనటం మొదలుపెట్టలేదు. అప్పటి కింకా నా పాతగాయం మానలేదు. అదేదో క్లుప్తంగా నీకు వివరించాలనిపిస్తున్నది ఈ చివరి తరుణంలో. నీవు గురువుగారి వద్దకు రాకపూర్వం జరిగిన కథ ఇది. అప్పటికి నేనింకా వీణ నేర్చుకోనటం ప్రారంభించలేదు. గాత్రాన్ని సాధనచేస్తూ ఉండేవాడిని. అప్పటి నా సహాధ్యాయిని లకుమ. ఆమె కంఠం శ్రావ్యంగా ఉండేది. సంగీత ప్రియుడనైన నన్ను ఆమె తన రాగాలాపనతో ఏ లోకానికో తీసుకువెళ్లేది. నేత్రాలు మూసు

# డెడ్ లెటర్

కొని ఆ ఆనందంలో, హాయిలో, తన్మయత్వంలో తేలిపోయే నేను ఆమె రాగాలాపన ముగించగానే ఉలిక్కిపడి మేల్కొనేవాడిని. ఆ కళామయిని నాదానిగా చేసుకొంటే, ఎప్పుడూ ఆమె పాడుతూ ఉంటే ఆమె ఒడిలో తల ఉంచుకొని విశాల నీలాకాశంలోని నక్షత్రాలను చూస్తూ కాలం గడపవచ్చు కదా అనుకొనేవాడిని. ఒక్కసారి ఆమె తన కుటుంబ దీన స్థితిగతులను నాముందు చెప్పుకొని కన్నీళ్లు కార్చింది. 'నీ కభ్యంతరం లేకపోతే నేను నిన్ను వివాహం చేసుకొంటాను, లకుమా' అని ఆమెకు తెల్పాను. ఆమెఎంతో సంతోషించింది. ఆనాటినుండి మరింత ఉత్సాహంతో సంగీత సాధన చేసింది. ఆనాటినుండే మేము మరింత సన్నిహితుల మయ్యాము. ప్రతి పనిలోనూ ఇద్దరం కలిసి ఉత్సాహంగా పాల్గొనేవారం. ఒక్కరోజు కలుసుకోకపోతే ఇద్దరకూ పిచ్చెక్కినట్లు ఉండేది. ఏదో విషాన్ని మింగినంత బాధగా ఉండేది. మేమిద్దరం అలా ఒకచోట తిరిగేవారం; ఒకచోట సాధనచేసేవారం. ఆమె పరీక్షలో ప్రథమ శ్రేణిలో కృతార్థురాలయింది. ఆమె తన అక్కగారిల్లు వదిలి తల్లిదండ్రుల వద్దకు వెళ్లబోయే రోజున నా పాదాలపైబడి ఏడుస్తూ 'నేను మా తల్లిదండ్రులను మన వివాహానికి ఒప్పించటానికి శతవిధాల ప్రయత్నిస్తాను. ఒకవేళ వారు అంగీకరించని పక్షంలో వారిని దూరం చేసుకొనైనా సరే మీవద్దకు వచ్చేస్తాను. నాకు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని మరచిపోకండి. మీపాదాల వద్ద నాకిచ్చిన చోటును మరొకరికి వరం చేయకండి' అంది. నేనామెకు వాగ్దానంచేసి పంపాను. ఆమె వెళ్లిన మూడు నెలలకు నాకో ఉత్తరం వ్రాసింది — కులాంతర వివాహానికి



సందిగ్ధత

చిత్రం—ప్రేమచంద్ర గోస్వామి (జయపూర్)

తన తల్లిదండ్రులు అంగీకరించలేదని, తాను వారి మాట నెదిరించి రాలేనని, అందుచేత ఇక ఈ వివాహం అసంభవమని. ఆ ఉత్తరం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. ఆమె నాతో గడిపిన అనేక మధురక్షణాలు, ఇద్దరం కలిసి గాలిలో కట్టుకున్న ఊహాసౌధాలు, ఇద్దరం కలిసి సాధన చేస్తున్నప్పుడు, ఇద్దరం ఎగ్జిబిషన్‌లో, పార్కులో విహరిస్తున్నప్పుడు కలిగిన సరస్సు తలపులు మరచిపోలేకపోయాను. ఆమే స్వయంగా నన్ను ఆ పరిస్థితికి తీసుకు వచ్చింది. నా చేయి పట్టుకొని తనతోపాటు నన్నూ పర్వతశిఖరం ఎక్కించి కన్ను గభాలున క్రిందకు తోసి తాను నవ్వుకొంటూ క్రిందికి దిగి వెళ్లింది. ఆ గాయం నాకు మానలేదు. ఆ బలమైన దెబ్బే నన్ను స్త్రీ ద్వేషిగా మార్చింది. ఆమె నాకు చేసిన ఆకస్మిక అకారణ అన్యాయానికి, మోసానికి నేను బలైపోయాను. చాలాకాలంవరకు మరల సంగీతాన్ని చేపట్టలేకపోయాను. కాని కొంతైనా మనశ్శాంతి కావాలంటే సంగీతం కావాలని పించింది. వీణ ప్రారంభించాను. ఆ తీగల తీయని నాదంలో నా గానాన్ని మేళవిస్తూ గత స్మృతులను మరచిపోవటానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే నీవు నాకు ప్రత్యక్షమయ్యావు. కాని, నన్ను పాడమని నీవు కోరిన రోజున కూడ నిన్ను నా మనసులోకి రానీయలేను. కాని ఆ ఒక్కరోజుతో నీవు నాకు దూరమై ఉంటే ఈనాడు నీ కీ ఉత్తరం వ్రాసే అవసరమే ఉండేదికాదు. ఒకనాడు నీవు నా గదికి వచ్చావు. నేను ఆశ్చర్యపోయాను. నీకు స్వాగతంకూడ ఇవ్వలేకపోయాను. ఆరోజు నా గదిలో నన్ను బ్రతిమలాడి నాచేత పాడించి, నా వీణానాదపు స్వరాల్లో నీవు మైమరచి అందెలు మీటావు. ప్రథమంగా నిన్ను నిండుగా ఆనాడు చూశాను. పౌర్ణమినాటి వెన్నెలను ఒంటినిండా పులుముకు వచ్చినట్లుండే నీ శరీరచ్ఛాయను, కొనలవరకూ సన్నగా కాటుక పెట్టి హృదయంలోకి సూటిగా చూసే నీ చూపులను, నవ్వినప్పుడు నోరంతను తెరువకుండా దానిమ్మగింజల్లా కనిపించే నీ పలువరుసను, కోలగా ఉండే ఆమోము, నొసటి మధ్యలో ఎర్రగా మెరిసే బాదంపప్పులాంటి తిలకపు బొట్టును చూశాను. నీసౌందర్యం, కళవన్నె నీకుగల ప్రేమ, అభిమానం నాలో నిలిచిపోయాయి. ఆనాటినుంచే మన పరిచయం ప్రారంభమైంది. నీకోర్కెపై, నీ ప్రస్తవనపై నేను రోజూ నీ ఇంటికి వస్తూ ఉండేవాడిని. మల్లె పందిరిక్రింద తివాసిపై నేను కూర్చుని వీణను మీటుతూ ఉంటే నీవు దేవకన్యలా నా ఎదుట నాట్యంచేసే ఘడియల్లోనన్ను నేను మరచిపోయేవాడిని. నిన్ను చూస్తూ నాపాత గాయాన్ని, స్త్రీ పట్ల నాకుగల ద్వేషాన్ని మరచిపోయాను. ఇక పగటి కలలు కనటం ప్రారంభించాను. నిన్ను నాలో ఐక్యం చేసుకొంటే,

(తరువాయి 54 వ పేజీలో)

## మరపురాని మనిషి

( 5 వ పేజీ తరువాయి)

వర్త్ కవి 'ఏన్‌వోట్ టు ఇంటిమేషన్ ఆఫ్ ఇమ్మోర్టాలిటీ'ని, గోల్డ్ స్మిత్ కవి 'ట్రావెలర్'ను, షేక్స్పియర్ 'మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీం, హామ్‌లెట్' మొదలయిన నాటకాలను సంస్కృతీకరించారు. "ప్రశ్నోయం సముపస్థితో మమ పురః జీవామ్యజీవామి వా" అంటూ హామ్లెట్ సంస్కృతంలో ఆలోచిస్తాడు. థామస్ గ్రే కవి "ది కర్‌ఫ్యూ టోల్స్ ది నెల్ ఆఫ్ పార్టింగ్ డే" పాదంతో ప్రారంభమయ్యే ఎలిజీని—

"వాదత్యేష లవనవిరవా
  ద్యోతినీ నైశఘంటా
ప్రత్యాయాంతి స్వయమిహ శనైః
  గోచరాద్గోధనాని,
స్వీయం వేశ్మానుసరతి పరి
  క్లిన్నగాత్రః కృషీకః
యుంజన్ గుప్త్యై నిభృతజగతో
  మాం చ గాఢాంధకారం"

అంటూ "చైత్య విలాపః" అన్న ఖండకావ్యంగా మధుర గంభీరంగా అనువదించారు.

హర్కారేవారు ఓరియంటల్ కాన్ఫరెన్స్ శాశ్వత సభ్యులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యులు.

ప్రస్తుతం వారు చార్‌మినార్ అవల ఉన్న అలియాబాద్‌లోని గోవిందబాగ్ అనే సొంత తోటలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఓపిక ఉన్నప్పుడు సేద్యం చేయిస్తారు. ప్రతి దినం ఉషఃకాలంలోనే లేచి, స్నానాద్యనుష్ఠానాలు తీర్చుకుని, పార్థివ లింగపూజ చేస్తారు. ఆహార నియమంతో, వచ్చినవారిని సత్కరిస్తూ నిరాడంబరంగా సంతృప్తితో ఉన్నందువల్లనే కాబోలు, ఈ 77 వ సంవత్సరంలోను వారి నడుము వంగలేదు; చూపు తగ్గలేదు; వాదపటిమ విడనాడలేదు; సమున్నత విగ్రహం సడలలేదు. వారికి సంతులేదు. ఒకరిని దత్తు తీసుకొన్నారు. ఆయన ఎల్ ఎల్. బి. పాసయి ఆంధ్ర హైకోర్టులో ఉద్యోగిగా ఉన్నారు.

"నా లక్ష్యం పార్సీ, ఉరుదూ, ఇంగ్లీషుల ద్వారా సంస్కృత భాషా ప్రచారం. పాణీనీయం మీద ఒక మిషన్ తయారుచేసి పరిశీలిస్తున్నాను. వేద సంహితకు కాండసూచి సిద్ధపరుస్తున్నాను. వాటిని పూర్తిచేయాలి. 'ఉపనిషత్తత్త్వముక్తావళి' అన్న పేరుతో ప్రస్థరలో ఎప్పుడో ప్రారంభించిన ఉపనిషద్భాష్యం ఇంకా పూర్తి కాలేదు. ప్రతి ఓరియంటల్ కాన్ఫరెన్స్ నా ప్రాణం. ఈసారి వెళ్లలేకపోయాను. వ్యాసం మాత్రం పంపాను" అన్నారు వారు, ఆవేదనతో.

నిజమే. హర్కారేవారిది అపూర్వ వ్యక్తిత్వం. సజాతీయ విజాతీయ సంస్కృతులను జీర్ణించుకొని, పాండిత్యంతో పరిణతిపొంది, సాహిత్యంలోను, న్యాయాధీశుడుగా అసిధారావ్రతంతో మెరిగే వారివంటివారు మన నాడులో అరుదు. వారి విజ్ఞానభండారం వ్యర్థంకాకూడదు. వారి వ్యాసాలు, గ్రంథాలు పెక్కు సంపుటాలవుతాయి. వాటిలో కనీసం నిరుక్తం ఆంధ్రానువాదం, మస్నవీ షరీఫ్ సంస్కృతీకరణం, ఆంగ్ల రచనల అనువాదాలనైనా సాహిత్య అకాడెమీవంటి సంస్థలు ప్రచురించి పుణ్యం కట్టుకోవాలి. ఈ విషయంలో విద్యారణ్యంలో హర్యక్షుల వంటి హర్కారేవారి సహకారమూ కూడ గట్టుకోవాలి.

**—తిరుమల రామచంద్ర**

## డెడ్ లెటర్

( 8 వ పేజీ తరువాయి)

నాలోనే నీవు నాట్యం చేస్తుంటే, ఇక నా కెలాంటి బ్రతుకూ అక్కరలేదని అనుకొంటూఉండేవాడిని. అనే ఊహలతో నేను నిన్ను ప్రతిక్షణం స్మరించుకొంటూ ఉండేవాడిని. ఇక నీ ఇంటికి రాకుండా, నీ నాట్యాన్ని వీక్షించకుండా, ఉండలేని పరిస్థితి కలిగింది. కేవలం ఆ సంఘటనలతోనే నా మనసు ఊరట చెందకపోవటమే ఈనాటి ఈ బాధకు కారణం. నిన్ను నా స్వంతం చేసుకుంటేనే గాని నాకు హాయి రాదనిపించింది. కాని అది ఎలా సాధ్యమవుతుంది?— నీవొక ఇంటిదానవు. భర్త పంచలో ఏ బాధాలేకుండా నిర్మలంగా బ్రతుకుతున్న ప్రాణివి. నీకు నా ప్రేమను, కోర్కను ఎలా తెల్పగలను? తెల్పిన పిదప నీ నుండి నిర్భాధా పుతిరస్కారం వస్తే ఎలా భరించగలను? నీవు అందరాని పుష్పానివి. ఒకరికి దత్తు కాబడిన దానవు. నా దగ్గరకు ఎలా రాగలవు?—అనే ప్రశ్నలు నన్ను ఎదుర్కొన్నాయి. కాని, నేను నిన్ను దూరం చేసుకుని బ్రతకలేనని నాకు తెలుసు. అందుకే నీ భర్తకు మతి చలించినా సరే ఏ విధంగానైనా తీసుకొని ఏ మారుమూల ప్రాంతానికో పోయి అచ్చట నీవూ, నేనూ బ్రతుకుదా మనిపించింది. అందుకు నాకోర్కను నీకు తెల్పాలనే యత్నంలో ఉండగా నేనొక అపూర్వ దృశ్యం చూచాను. నీ భర్త నీపట్ల చూపే అపారమైన ప్రేమ, నీవు నీ భర్తపట్ల చూపే ఆదరణానురాగాలు, నీ నృత్యాన్ని చూసి తన్మయత్వంచెందే ఆయన మోము, ఆయన మోములో గోచరమయ్యే సంతోషాన్ని చూసి నీవు పొందే అపరిమితానందం, ఇద్దరకూ ఒకరిపట్ల ఒకరికి గల గాఢవిశ్వాసం నన్ను మార్చివేశాయి. హక్కుగా, ప్రేమగా నీ భర్త అనుభవిస్తున్న సౌందర్యపు ముద్దను, ఆనందపు గనిని నేను నా స్వంతం చేసుకోవాలనటం ఎంతటి మూర్ఖపు కోరికో, నీచపు తలపో నాకు అర్థమయ్యాయి. నిన్ను నాలో ఐక్యం చేసుకొనే కోర్క కలిగిన నాపై నాకే అసహ్యం కలిగింది. ఇక ఈ ప్రాంతంలో ఉండరాదని, ఇట్టి దుష్టపు తలపులతో నీ ఎదుట మసలరాదని అనిపించింది. ఒకవేళ ఇక్కడే ఉంటే, నాకు సుఖశాంతులు పూర్తిగా దూరమవుతాయి. అందుకే నీకు దూరంగా వెళ్లిపోవాలనే నిశ్చయానికి వచ్చాను. అది నాకు చాలా బాధాపూరితమే కావచ్చు. కాని నా దసలు బాధితహృదయం. దానికి ఆనందాన్నివ్వటానికి, శాంతిని కలుగచేయుటానికి ఒక కళామయి అవసరం. కాని నాకట్టి మూర్తి దొరికే అదృష్టం లేదు. నాకట్టి అదృష్టం లభింపచేసుకోవటానికి నీ జీవితపు వెలుగులోనికి ప్రవేశించదలుచుకోలేదు. ఈనాటి ఈ కాళరాత్రిలాగానే నేనూ నిన్ను విడనాడితే నీ జీవితం వెన్నెల మాదిరి ప్రకాశించాలని నా వాంఛ. ఆ వెన్నెలలో రాహువుగా నేను ప్రవేశించకుండా ఉండటానికే నేను నీకు దూరమవుతున్నాను. ఇంకో రెండు గంటల్లో రైలుంది. వర్షం తగ్గినా, పెరిగినా ఈ నిరాశాజీవికి అడ్డంలేదు. నీచేతుల్లో ఈ ఉత్తరం ఉండే సమయానికి నే నే ప్రాంతంలో ఉంటానో, నా పయనం ఎక్కడికో, నా ధ్యేయం ఏమిటో వాటిని గురించి ఇంకా నేనేమీ నిర్ణయించుకోలేదు. అప్రస్తుత విషయాలన్నీ చెప్పి, నీ మనసు నొప్పిస్తే నన్ను క్షమించు. నాలో శిథిలమైన మనోవేదనను నీకు తెలుపుకొంటే కొంతైనా ఆ భారం తగ్గుతుందని తెలిపాను. ఇక నీ జీవితంలో నన్ను తలుచుకోకు. నాలాంటివాడికి నీ దృష్టిని చూపకు. భగవంతుడు నీకు హాయైన, ప్రశాంతమైన జీవితాన్ని ఇవ్వాలని, నీవు నిర్మలంగా, నిశ్చలంగా, నిబ్బరంతో, శాంతిగా నీ భర్తతో పదికాలాలపాటు సుఖమయ సంసారాన్ని గడపాలనీ నా తుదికోర్క.

సెలవు.

రమణ."

"ఏమిటి, సార్, మీ కళ్ల వెంబడి నీళ్లొస్తున్నాయి?" అన్న సుబ్బయ్య ప్రశ్న నన్నీలోకంలోకి తీసుకువచ్చింది.

"ఏం లేదు, సుబ్బయ్యా. నువ్వెళ్లి ఒక కాఫీ తీసుకురా" అని పంపాను.

నా మనసు భావపూరితమైంది. ఒకరికోసం మరొకరు త్యాగం చేశారు కాని ఒకరి త్యాగం ఒకరికి తెలియదు. తమ రెండు జీవితాలను కలుపుకోలేని ఆ రెండు హృదయాలు డెడ్‌లెటర్ ఆఫీసులో కలుసుకొన్నాయి. వాటినైనా అలా కలిపి ఉంచాలనుకొన్నాను. రెండింటిని కలిపి గుచ్చి చందనపు పెట్టెలో భద్రపరిచాను.

వారెవరో, ఎక్కడ ఎలా ఉన్నారో, నాకు నేటికీ తెలియదు. కాని వారి పవిత్రమైన రెండు హృదయాలూ నావద్ద భద్రంగా ఉండి నా పూజలు అందుకొంటున్నాయి. ★